క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

జడ్చర్ల: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను జడ్చర్ల ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో గురువారం వేలం వేయనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటోలు తదితర వాహనాలు ఉంటాయని ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చని సూచించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

జడ్చర్ల: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో బుధవారం జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్‌బ్యాగులు, దుస్తులు, బెడ్‌షీట్స్ తదితర వస్తుసామగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న మౌళిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ విజయలక్ష్మి, వార్డెన్ తారాబాయి, లోకేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఓపీ సేవలు ప్రారంభం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనంలో బుధవారం ఓపీ సేవలు ప్రారంభించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సాధారణ ఓపీ సేవలు పొందవచ్చని అర్బన్‌హెల్త్ సెంటర్ డాక్టర్ శివకాంత్ పేర్కొన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు శ్వేత, సుచరిత వైద్యసేవలు అందిస్తున్నారు. ఓపీ ప్రారంభించటంపై పట్టణ ప్రజలు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

చిన్నచింతకుంట: కొత్త పట్టాదారు(2023–24) పాసుబుక్కులు పొందిన వారు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న ఒక ప్రకటనలో బుధవారం పేర్కొన్నారు. ఈనెల 16 వరకు పాస్‌బుక్‌లు పొందిన రైతులు అర్హులని వివరించారు. సంబంధిత ధ్రువపత్రాల జీరాక్స్‌లతో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన బోయ మనెమ్మ కొన్నాళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థికసాయం అందజేసి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అదేవిధంగా పింఛన్లు మంజూరు కానీ రజియాబేగం, ముష్టి బాలరాజుకు చెరో రూ.2వేల ఆర్థిక సాయం అందజేశారు. తర్వాత ముత్యాలంపల్లిలో గొల్ల కుర్మయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. వర్నె వాగులో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కోఆప్షన్ ఖాజాఘోరీ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల: కూలీ పనులు చేసేందుకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం గొరిటకు చెందిన అబ్దుల్ సలాం(45) కూలీ పని నిమిత్తం గొరిట నుంచి జడ్చర్లకు ఈనెల 7న ఆటోలో వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం తండ్రి కాశీంబీ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువకుడికి విద్యుత్ షాక్

గండేడ్: విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడు షాక్‌కు గురైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుండె ప్రకాష్ బుధవారం సాయంత్రం 4గంటల సమయంలో వారు కట్టుకున్న వైరుకు ఆరేసిన దుస్తులు తీసుకురావడానికి వెళ్లాడు. అప్పటికే వర్షం చినుకులు ప్రారంభమయ్యాయి. దుస్తులు తీస్తుండగా ఒక్కసారిగా విద్యుత్‌షాక్ తగిలి ఇసుకలో పడ్డాడు. త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. కాగా విద్యుత్ శాఖ వారు మెయిన్ లైన్ స్తంభానికి ఇన్సులేటర్ లేకపోవడంతో పక్కనే ఉన్న ఇంటికి కట్టారు. దీంతో వర్షం రావడంతో ఇలాంటి ఘటన చోటుచేసుకుందని స్థానికులు అంటున్నారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో వైర్లు ఇళ్లకు కట్టడమేమిటని ప్రశ్నిస్తున్నారు. దీంతో వర్షం పడితే ఇల్లు మొత్తం షాక్ వస్తుందని కుటుంబీకులు పేర్కొన్నారు. విద్యుత్ సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కందూర్‌లో ప్రత్యేక పూజలు

అడ్డాకుల: ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ మంజుల, ఎంపీఓ విజయకుమారి, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓ ప్రవీన్, దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రమౌళి, రమేష్, కొత్త లక్ష్మయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవాబుపేట: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పురుషోత్తం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన చుక్క జగన్ కారూర్ సమీపంలోని దుందుభి వాగులో నుంచి ఇసుకను ఇప్పటూర్ మీదుగా అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమాని జనార్దన్‌పై కేసునమోదు చేసినట్లు వివరించారు.



ఇప్పటూర్‌లో..



మిడ్జిల్‌లో..



బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ఆచరిస్తేనే ఆరోగ్య 'యోగ'ం



మహబూబ్‌నగర్‌లో యోగాడేలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జిల్లా పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, ఆయుష్‌శాఖ, నెహ్రూ యువ కేంద్రం, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగాడే సందర్భంగా పలువురు ప్రదర్శించిన యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. యోగాసనాలు వేశారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని అన్నారు. శ్రీరామజయరామ సంస్థల ఆధ్వర్యంలో యోగాడేలో పాల్గొన్న వారికి 200 టీషర్ట్‌లు, అల్పాహారం అందజేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామజయరామ సంస్థల అధినేత బెక్కరి రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింలు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, డీఎంహెచ్‌ఓ కృష్ణ, డీవైఓ కోటా నాయక్, డాక్టర్ రమేష్ సరోడే, డాక్టర్ శ్రీకాంత్, మనోహర్‌రెడ్డి, లయన్ నటరాజ్, బీఎస్‌టీ జిల్లా అధ్యక్షులు కె.వెంకట్రాముడు, పీవైఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, వనజారెడ్డి, సాయికుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కళాశాల లెఫ్టినెంట్ యాదయ్య మాట్లాడుతూ యోగా వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుందన్నారు. అధ్యాపకులు అనిత, జగన్, విట్టల్, విజయలక్ష్మి, వనిత, చిట్టెబోయిన్‌పల్లి గురుకుల సీటీఓ శరణ్య పాల్గొన్నారు. అదేవిధంగా సంస్కార భారతి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

మిడ్జిల్: మండలంలో బుధవారం రామాంజనేయులు గురూజీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్, తిరుపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: స్థానిక మైదానంలో జెడ్పీ వైస్ చైర్మన్‌యాదయ్య యోగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ రాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలో బుధవారం ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో శిక్షకుడు భారతయ్య సమక్షంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జ్ఞాపకశక్తి పెరుగుదలకు సంబంధించిన మందులను ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, డాక్టర్ లావణ్య మహిళలకు అందజేశారు. డీటీ నర్ర శ్రీనివాస్, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఏఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు రాజు, యాదయ్య, ప్రేం సుధాకర్‌జీ, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూత్పూర్: వైద్యాధికారి మహమ్మద్ జహీరోద్దీన్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలో యోగా ప్రత్యేక సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జి.శీరిష, మండల వైద్యాధికారి డా.అబ్దులరబ్, సీహెచ్‌వో రామయ్య, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

మహమ్మదాబాద్: మండల వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో యోగాడే నిర్వహించారు. నిర్వాహకులు విజయానంద్‌రెడ్డి, జనార్దన్, శ్రీశైలం, పాండు, వెంకటయ్య, విజయ్, హనుమంతు, అనంతయ్యగుప్త, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మండల పరిధిలోని మోతీఘణపూర్ చెరువు కట్టపై ఎంపీఓ నజీర్ అహ్మద్, సర్పంచ్ మాలతిలతోపాటు గ్రామస్తులతో యోగా కార్యక్రమం నిర్వహించారు.

పాలమూరు: బీజేపీ జిల్లా కార్యాలయంలో శ్రీ హనుమాన్ కరాటే యోగా అసోసియేషన్ మాస్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో యోగాసనాలు ప్రదర్శించారు. జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్‌పీ వెంకటేష్, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.



మహమ్మదాబాద్ ఉన్నత పాఠశాలలో..



జడ్చర్లలో యోగా శిబిరంలో పాల్గొన్న జెడ్పీ వైస్ చైర్మన్‌యాదయ్య



అడ్డాకులలో..



జిల్లాకేంద్రంలో మెమోంటోలు అందుకుంటున్న విద్యార్థులు



మోతీఘణాపూర్ చెరువుకట్టపై..



భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

మట్టిని కాపాడితేనే మనుగడ : మంత్రి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : మట్టిని కాపాడితేనే మానవ మనుగడ సాధ్యమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మట్టిని కాపాడాలని కోరుతూ యూపీకి చెందిన మోహిత్‌నిరంజన్ మొదలుపెట్టిన సైకిల్‌యాత్ర జిల్లా కేంద్రానికి చేరిన సందర్భంగా బుధవారం అతడిని క్యాంపు కార్యాలయంలో మంత్రి అభినందించారు. గత ఏడాది నవంబర్ 16న లలిత్‌పూర్ నుంచి ప్రారంభమైన సైకిల్‌యాత్ర 6 వేల కి.మీ పూర్తి చేసుకుందని మోహిత్ ఈ సందర్భంగా తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : చిరు ధాన్యాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల స్టాల్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌వైకే జిల్లా అధికారి కోటానాయక్, డీఎంహెచ్‌ఓ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తరలింపు

మహమ్మదాబాద్: ఎలాంటి అనుమతి లేకుండా వెంచర్‌లో రోడ్ల కోసం మట్టి తరలించడంపై జేసీబీ, ట్రాక్టర్లను పట్టుకున్న ఘటన మహమ్మదాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలో ఇటీవలే ఏర్పాటు చేస్తున్న ఓ వెంచర్ డెవలప్‌మెంట్‌కు ఓ కాంట్రాక్టరు నిబంధనలకు విరుద్ధంగా రెండురోజులుగా ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నాడు. మంగళవారం రాత్రి సైతం తరలింపు చేపట్టడంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు జేసీబీ, ట్రాక్టర్లను పట్టుకున్నారు. కార్యాలయంలో ఉంచి బుధవారం జరిమానా విధించి వదిలివేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,026

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగకు గరిష్టంగా రూ.2,026, కనిష్టంగా రూ.1,730 ధరలు లభించాయి. అదేవిధంగా జొన్నలు రూ.3,111, ఆముదాలు గరిష్టంగా రూ.5,765, కనిష్టంగా రూ.5,540, హంస రకం ధాన్యం గరిష్టంగా రూ.1,936, కనిష్టంగా రూ.1,516, ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2,480, కనిష్టంగా రూ.1,440, శనగలు రూ.5,050 ధరలు లభించాయి.

ఆలయానికి విరాళం



నవాబుపేట: చౌడూర్ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి ఆయన బుధవారం సర్పంచ్ వెంకటేష్, గ్రామపెద్దల రూ. 1.20లక్షలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు సన్మానించారు. ఆకుల శరణప్ప, అమరేష్, ఆంజనేయులు, కుమార్, వాసు, తీర్పతయ్య, గోపాల్, నారంజీ పాల్గొన్నారు.

సర్పంచ్‌పై వ్యతిరేకతతో వార్డు సభ్యుల ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు

బాలానగర్: చెన్నంగులగడ్డ సర్పంచ్ రవినాయక్ అభివృద్ధికి సహకరించడం లేదని బుధవారం ఆ గ్రామ వార్డు సభ్యులు ఆయన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ ఎదుట గ్రామస్తులతో కలిసి ధర్నా చేశారు. గ్రామంలో ఓ ప్రైవేటు వెంచర్‌కు సర్పంచ్ అనుమతితోనే 11 కేవీ లైన్ వేస్తున్నారని, ఇందులో పాలకమండలి సభ్యులతో ఎలాంటి చర్చా లేకుండా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలను నరికడానికి సిద్ధపడ్డారన్నారు. 8 ఏళ్లుగా పెంచిన మొక్కలను నరికి ప్రైవేట్ వెంచర్‌కు విద్యుత్ ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అదేవిధంగా వెంచర్లలో ఎలాంటి గ్రీనరీ, విద్యుత్, ట్యాంకుల నిర్మాణం వంటివి లేకుండానే మార్టిగేజ్ రిలీజ్ చేసినట్లు ఆరోపించారు. ఘటనపై స్పందించకుంటే వార్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తామని హెచ్చరించారు. వార్డు సభ్యులు బాబునాయక్, గోరీ, కిరణ్, ఉమాదేవి, భూపాల్ రెడ్డి, భారతమ్మ, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, శ్రీను, కృష్ణరెడ్డిలతో పాటు సుమారు 50 మంది గ్రామస్తులు ఉన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి



నవాబుపేట: తెలంగాణ కోసం పరితపించిన ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: జెడ్పీ హైస్కూల్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీసీసేన మండల అధ్యక్షుడు నిరంజన్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్ జెడ్పీటీసీ శశికళ, నాగమ్మ, బాబు, సాయిలు, రాణీజైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.



కేంద్రం దృష్టికి తీసుకువెళ్తాం



పాలమూరు: జాతీయ రహదారులు, బ్రిడ్జిల నిర్మాణాలు ఎలా జరుగుతాయి అనే నిబంధనలు తెలుసుకోకుండా రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అప్పన్నపల్లి బ్రిడ్జి ప్రారంభం చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి ఆరోపించారు. మంత్రిపై కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు. బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జడ్చర్ల నుంచి రాయచూర్ వరకు ఉన్న జాతీయ రహదారికి రూ.290కోట్లతో అప్పట్లో కేంద్ర మంత్రి నితీన్‌గడ్కరి శంకుస్థాపన చేశారన్నారు. రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి త్వరలో అప్పన్నపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిని కేంద్ర మంత్రి నితీన్‌గడ్కరితో ప్రారంభం చేయిస్తామని దానికి టైం తీసుకుంటున్నట్లు తెలిపారని సూచించారు. బీకే రెడ్డి కాలనీలో మంత్రి పాలాభిషేకం చేసుకోవడం హేయమైన చర్యని, కాలనీ వర్షం వస్తే పూర్తిగా మునిగిపోతుందన్నారు. కలెక్టరేట్‌లో ఎవరికి తెలియకుండా రహస్యంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 22 నుంచి 30వరకు జిల్లాలో బూత్ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి కేంద్రం పథకాలను ప్రజలకు తెలియపరుస్తామన్నారు. 25న నాగర్‌కర్నూల్‌కు జేపీ నడ్డా వస్తున్నాడని లక్ష మందితో సభ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. బీజేపీ నేతలు పడాకుల బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హన్వాడ మండలం గొండ్యాలగ్రామానికి చెందిన పలువురునాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బుధవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అధికార పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి అన్నారు. కార్యక్రమంలో కరుణాకర్‌గౌడ్, లక్ష్మయ్య, రమణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

రాజాపూర్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శివసీతారామాంజనేయస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని కీర్తనలు ఆలపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు నిధులు కేటాయించిందని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాలతో సన్మానించారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కప్పెరిబచ్చిరెడ్డి, ఎంపీపీ సుశీల, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీఓ లక్ష్మీదేవి, నాయకులు పాల్గొన్నారు.

భూతగాదాపై కేసు నమోదు

బాలానగర్: భూమి విషయంలో వివాదం చెలరేగి తమ్ముడిని అన్న తీవ్రంగా గాయపర్చిన ఘటనపై పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరన్నపల్లి గ్రామానికి చెందిన పట్నం యాదయ్యపై సోమవారం అతడి అన్న నర్సిములు భూవివాదం విషయమై దాడి చేశాడు. దీంతో యాదయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి కృషిచేశాం

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ తాను దేవుడికి సేవ చేసేవాడినని అన్నారు. స్థానిక రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేశానని తెలిపారు. తన సర్వీస్‌లో ఎన్నో దేవాలయాలకు సేవలు చేసే భాగ్యం లభించిందని పేర్కొన్నారు. ఆలయాలను చులకనగా చూసేవిధంగా మాట్లాడవద్దని కోరారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని శ్రీ కంచికామకోటి పీఠం పాలమూరుశాఖ వేంకటేశ్వరస్వామి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. సుదర్శన హోమం, మూలమంత్రాల హోమం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పురవీధుల గుండా రథం మీద శివ, కేశవులు దర్శనమిచ్చారు. అనంతరం తోటపల్లి శ్రీకాంత్‌శర్మ యజ్ఞం విశిష్టత వివరించారు. కార్యక్రమంలో ఉపేంద్ర కుమార్ అగర్వాల్, గొండ్యాల రాఘవేంద్రశర్మ, గుండా వెంకటేశ్వర్లు, రామలింగం, శ్రీచంద్రశేఖర వేద పాఠశాల గురువు మునీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రిక్వెస్ట్ బస్‌స్టాపుల ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న డీఎమ్ సుజాత తదితరులు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో ఆర్వోబీ ప్రారంభించిన తరువాత రైల్వే గేటును మూసి వేయడంతో ఆర్టీసీ బస్సులు బస్‌స్టాండ్‌లోకి వెళ్లడం లేదు. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని బుధవారం ఆర్టీసీ అధికారులు రిక్వెస్ట్ స్టాపుల కోసం స్థల పరిశీలన చేశారు. పట్టణం నడిబొడ్డున బస్టాండ్ ఉండటంతో హైదరాబాద్, రాయిచూర్, మహబూబ్‌నగర్, కర్ణాటక ప్రాంతాల బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లడానికి యూటర్న్‌లు లేక ఆర్వోబీకి రెండు వైపుల బస్సులను ఆపుతున్నారు. దీంతో ఆర్వోబీ రెండు వైపులా స్టాపులు ఏర్పాటు చేయనున్నారు. ఆర్టీసీ డీఎమ్ సుజాత, ఎంపీపీ రమాదేవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు : ఎమ్మెల్యే



కొమురయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: తెలంగాణ వచ్చాకే గ్రామాలు అభివృద్ధిలోకి వచ్చాయని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గద్దెగూడెంలో రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవనానికి, రూ. 5 లక్షలతో ముదిరాజ్ భవనానికి బుధవారం శంకుస్థాపనలు చేశారు. ప్రత్యేక రాష్ట్రంలో ప్రజలకు తాగునీటి సమస్య అనేదే లేకుండా మిషన్ భగీరథ తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాధవి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, బాలగణేశ్, రంగయ్యగౌడ్, మాధవులు తదితరులు పాల్గొన్నారు.

'బలగం' కొముర‌య్యకు సన్మానం

భూత్పూర్: పట్టణంలోని వివేకానంద విద్యాలయంలో స్మార్ట్ క్లాసు తరగతులు, సీసీ కెమోరాలను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బలగం సినీ నటుడు కొమురమ్య(సుధాకర్‌రెడ్డి)ని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం సన్మానించారు. సినిమా సన్నివేశాలు, పాటలు, కుటుంబ నేపథ్యం కథనాలపై ఆయనతో ముచ్చటించారు. మండలంలోని పలు గ్రామాలల్లో బలగం సినిమా ప్రదర్శించినట్లు వివరించారు. చైర్మన్ బస్వరాజ్ గౌడ్, పాఠశాల కరస్పాండెంట్ సి.నర్సింహులు, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి నాయకులు తదితరులు ఉన్నారు.